సాక్షి నిజామాబాద్

శుక్రవారం, 22, నవంబర్, 2024



క్రీడల్లో ప్రతిభ

జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

- 8లో ▸



ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

గోదాం రోడ్డులో కూరగాయల వ్యాపారులకు గాంధీగంజ్‌లో స్థలం కేటాయించడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.3 /12.1

ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ

సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకాలు విక్రయించిన రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులు జమ చేసింది. 3,223 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో గురువారం రూ. 12 కోట్ల 52 లక్షల 43 వేలు జమయినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి తెలిపారు. 2,50,486 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించిన డబ్బులు జమ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిసింది.

గ్రూప్-2 మైనారిటీ అభ్యర్థులకు మాక్ టెస్ట్

నిజామాబాద్ అర్బన్: గ్రూప్–2 మైనారిటీ అభ్యర్థులకు డిసెంబర్ 2న మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు మాక్‌టెస్ట్ నిర్ణీత తేదీన ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 4.30 గంటలకు ఉంటుందన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీస్



నిజామాబాద్ అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్, డీఈవో అశోక్‌కు సమ్మె నోటీసు అందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. 15 రోజుల్లో తమను చర్చలకు పిలవకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళ్తామని పేర్కొన్నారు. నాయకులు అష్రఫ్ అలీ, విజయ్, భూపేందర్, ప్రసాద్ ఉన్నారు.

కన్న పేగు భారమైందా ?



కామారెడ్డి క్రైం: కన్న తల్లే వృద్ధాప్యంలో తన సంతానానికి భారమైంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ధర్మాసుపత్రిలో చేర్పి వదిలించుకుని వెళ్లిపోయారు. మాచారెడ్డి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గీకురు సాయవ్వ(70)కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్ద కుమారుడు కొన్నేళ్ల క్రితం మరణించాడు. పదేళ్ల క్రితం వారి కుటుంబం కామారెడ్డికి మకాం మార్చింది. ఈనెల 18 న సాయవ్వ కాలు జారి పడిపోవడంతో చేయి విరిగింది. మరుసటి రోజు ఆమెను కూతురు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయింది. అప్పటినుంచి కూతురు, రెండో కుమారుడు, కోడలు.. ఎవరూ ఆమె వద్దకు రాలేదు. ఆస్పత్రి వర్గాలు వారికి ఫోన్ చేసినా స్పందించడం లేదని తెలిసింది. అందరూ ఉన్నా అనాథగా మారిన సాయవ్వ బాగోగులను ఆస్పత్రి సిబ్బంది, పోలీసు కానిస్టేబుల్ లక్ష్మణ్ రావు చూస్తున్నారు.

• వందనం



జానకంపేటలోని సీటీసీలో ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్ కుమార్, ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

• ఆనందం



కాబోయే సతీమణితో ఆనందం పంచుకుంటున్న శిక్షణ పొందిన కానిస్టేబుల్

• ఆశీర్వాదం



అమ్మానాన్నల ఆశీర్వాదం తీసుకుంటున్న అన్నాదమ్ముళ్లు రాఘవేందర్, శివకుమార్

దేశంలోనే తెలంగాణ పోలీస్ నంబర్ వన్

- రాష్ట్ర వ్యాప్తంగా 8,149 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి
- పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడిన ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్ కుమార్



మాట్లాడుతున్న ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్ కుమార్

ఎడపల్లి(బోధన్): దేశంలోనే తెలంగాణ పోలీస్ నంబర్ వన్ స్థానంలో ఉందని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలోని సీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా 16 శిక్షణ కేంద్రాల నుంచి 8149 మంది కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఇంటర్నేషనల్, నేషనల్ ఐటీ, ఫార్మసీ కంపెనీలు ఉన్నాయని, అక్కడ పని చేసే సిబ్బందికి ఒత్తిడులు వస్తాయని, వాటిని అధికమించి ముందుకు సాగాలన్నారు. డ్యూటీని నిబద్ధతో చేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. పోలీసులు శాంతిభద్రతలు కాపాడటమే కాకుండా ప్రజల ఆస్తులను రక్షించాల్సి ఉంటుందన్నారు. పోలీసులకు ఒకే డ్యూటీ ఉండదని అన్ని రకాల పనులు చేయాల్సి ఉంటుందన్నారు. ఉత్తమ సేవలు అందించిన వారికి పోలీసు శాఖలో గుర్తింపు లభిస్తుందన్నారు. అడ్డదారులు తొక్కకుండా సక్రమంగా పని చేసి తెలంగాణ పోలీసులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. విధులతోపాటు తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసు అంటే వయోలెన్స్ చేసే వారికి వర్తించదని, సామాన్య ప్రజలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. శిక్షణ తీసుకున్న కానిస్టేబుళ్లలో 80 శాతం మంది గ్రాడ్యుయేట్లు, 20 శాతం మంది పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారన్నారు. వీరు రాబోయే రోజులలో ఐఏఎస్, ఐపీఎస్‌లు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలకు వెళ్లిన తర్వాత రిపోర్టు చేసి వారికి కేటాయించిన స్థానాలలో సత్ప్రవర్తనతో పని చేస్తూ రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇన్‌చార్జి పోలీసు కమిషన్ సింధుశర్మ పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్ జనరల్ శిక్షణపూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురికి మెడల్స్ అందించారు. సీటీసీలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 250 ఏఆర్ కానిస్టేబుళ్లుగా శిక్షణ పొందారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ పాల్గొన్నారు. పాసింగ్ అవుట్ పరేడ్ అనంతరం శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపారు. సెల్ఫీలు తీసుకున్నారు.

ఒక దాడి.. రెండు పార్టీల రగడ

- మేయర్ భర్తపై దాడి నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మాటల యుద్ధం
- హస్తం నాయకుల ప్రమేయం ఉందంటున్న గులాబీ నేతలు
- తమ వారి హస్తముంటే పార్టీ నుంచి బహిష్కరిస్తామంటున్న కాంగ్రెస్ నాయకులు
- బీఆర్ఎస్ హయాంలో వేల ప్లాట్లు కబ్జా.. బాధితులు ఫిర్యాదులు చేస్తే విచారిస్తామంటున్న అధికార పార్టీ నేతలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంలో భూకబ్జాలు, ఆక్రమణల కథలు మలుపులు తిరుగుతున్నాయి. నగరంలో చెరువులు, అటవీ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి ఇష్టం వచ్చినట్లు లేఅవుట్లు చేశారు. దీంతో అనేక వివాదాలు తలెత్తుతున్నాయి. సివిల్ వివాదాలు కాస్త క్రిమినల్ వ్యవహారాలుగా మారుతున్నాయి. తద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. తాజాగా మేయర్ నీతూ కిరణ్ భర్త దండు చంద్రశేఖర్ మీద చోటుచేసుకున్న దాడి ఘటన నేపథ్యంలో పార్టీల మధ్య వాడి వేడి వాతావరణం నెలకొంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రగడ నెలకొంది. ఇరు పార్టీల నాయకుల మధ్య పరస్పర ఆరోపణల పర్వం, మాటల యుద్ధం నడుస్తోంది. దాడి ఘటనలో కాంగ్రెస్ నాయకుల హస్తమందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి చేశారని, దాడి చేస్తూ వీడియో తీశారంటేనే ఇది పక్కా ప్లాన్ అని అర్థమవుతోందని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో శాంతిభద్రతలు బాగున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి దారుణంగా తయారైందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆరోపిస్తున్నారు.

■ దాడికి పాల్పడిన రసూల్ మాత్రం తన భూమిని ఆక్రమించి దండు శేఖర్ తనకు అన్యాయం చేశాడని, కాంగ్రెస్ నాయకులే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నెలకొంది. దండు శేఖర్‌పై చేసిన దాడి విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారెవరికీ సంబంధం లేదని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులే విచ్చలవిడిగా కబ్జాలు చేశారని, ఈ విషయమై బాధితులు ఫిర్యాదులు చేస్తే ప్రభుత్వం తగిన విచారణ చేస్తుందని మానాల అన్నారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు దళితబంధు పథకం విషయంలోనూ భారీగా డబ్బులు వసూలు చేశారన్నారు. దాడికి గురైన దండు శేఖర్ ఇద్దరు కాంగ్రెస్ నాయకుల పేర్లు చెప్పాడని మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా ఆరోపించడంతో.. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ ఆరోపణల్లో నిజం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నట్లు నిరూపిస్తే సదరు వ్యక్తులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని కేశ వేణు పేర్కొన్నారు. దండు శేఖర్‌పై దాడి బీఆర్ఎస్ అంతర్గత విషయమన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. దాడికి పాల్పడిన రసూల్ దండు శేఖర్ అనుచరుడిగా పదేళ్లు కొనసాగాడని వేణు పేర్కొనడం గమనార్హం. తాజాగా పంపకాల్లో తేడాలు రావడంతో ఈ ఘటన చోటుచేసుకుందని కేశ వేణు చెబుతుండడం పట్ల నగరంలో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా నగరంలోని ఒక్క నాగారం ప్రాంతంలోనే 2700 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయని, ఈ విషయాలపై బాధితులు ఫిర్యాదులు చేస్తే ప్రభుత్వంతో తక్షణమే విచారణ చేయిస్తామని వేణు పేర్కొనడం విశేషం. ఫిర్యాదులు చేసిన బాధితులకు రక్షణ కల్పిస్తామని చెబుతుండడం గమనార్హం. ఇంత తతంగం గమనిస్తున్న నగర ప్రజలు మాత్రం కబ్జాలు, ఆక్రమణలు కళ్లముందు కనిపిస్తున్నప్పటికీ కేసులు పెట్టకుండా తమకేం తెలియదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. మరోవైపు ఆరోపణలు చేస్తున్న అధికార పార్టీ నాయకులు బాధితులు ఫిర్యాదులు చేయాలని మాత్రమే అనడమేమిటని ప్రశ్నిస్తున్నారు. చెరువులు, వాగులు, కాలువలు కబ్జా అయిన విషయమై సర్వే చేసి కేసులు పెట్టకుండా తాత్సారం చేయడం తగదని పలువురు అంటున్నారు. పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలం గడపుతున్నాయంటున్నారు. నిజామాబాద్‌లో తక్షణమే హైడ్రా మాదిరిగా నిడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మనమెంతో మనకంత రిజర్వేషన్లు దక్కాల్సిందే



సదస్సులో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

నిజామాబాద్‌నాగారం: మనమెంతో మనకంత రిజర్వేషన్లు దక్కాల్సిందేనని... వందేళ్ల తర్వాత కుల గణన జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం నిజామాబాద్ నగరంలోని మేరు భవన్‌లో జరిగిన బీసీ కులగణనపై బీసీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ బిడ్డ మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షులు కావడంతోనే తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన సాధ్యం అవుతోందన్నారు. మహేశ్ కుమార్‌గౌడ్‌కు బీసీ సంక్షేమ సంఘం కుల గణన కోసం విన్నవించిందన్నారు. ఎప్పుడో వంద ఏళ్ల కిందట 1931 లో బ్రిటీష్ వారు జరిపిన కులగణనలో మనం 54 శాతం ఉన్నామని తెలిసిందని, అప్పుడు కేవలం 30 నుంచి 40 కులాలే మన బీసీల లిస్టులో ఉన్నాయన్నారు. ఇప్పుడు దాదాపు 130 కులాలు ఉన్నాయని, ఇప్పుడు మనం దాదాపు 60 శాతం ఉంటామని, మనమెంతో మనకు అంత వాటా దక్కాల్సిందే అన్నారు. బీసీ కులగణన జరిగితేనే మన రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత వస్తదని అన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, ఉద్యోగ సంఘం నాయకుడు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, కరిపే రవీందర్, దర్శనం దేవేందర్, పోల్కం గంగాకిషన్, కొయ్యాడ శంకర్, శ్రీలత, నారాయణ రెడ్డి, సత్యప్రకాశ్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ఎంపీ అర్వింద్ స్వాగతం

సుభాష్‌నగర్: హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎంపీ అర్వింద్ గురువారం బేగంపేట్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రపతి రెండ్రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటించనున్నారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

నగరంలో అక్రమ దుకాణాలు !



తిలక్ గార్డెన్ వద్ద సెకండ్ హ్యాండ్ బైక్‌ల పార్కింగ్

- భారీ షాపుల ముందు స్థలాలు అద్దెకు
- ట్రేడ్‌లైసెన్సులు లేకుండానే వ్యాపారం
- ఫుట్‌పాత్‌లు ఆక్రమణ.. పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- బల్దియా ఆదాయానికి రూ. కోట్లలో గండి

వ్యాపారాలు నిర్వహించుకోవాలంటే ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి. నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి తీసుకుని వ్యాపారాలు చేయాలి. అవి చిన్నవైనా, పెద్దవైనా సరే.. అయితే కొందరు వ్యాపారులు నిబంధనలను ఖాతరు చేయడం లేదు. అక్రమంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. భారీ షాపుల ఎదుట ఖాళీ స్థలాన్ని చిరు వ్యాపారాలకు ఎలాంటి అనుమతులు లేకుండా అద్దెకు ఇస్తున్నారు. దీంతో బల్దియా ఆదాయానికి ప్రతి నెలా రూ. కోట్లలో గండి పడుతోంది. అదేవిధంగా పలు దుకాణాల ఎదుట ఫుట్‌పాత్‌లను అక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ నగరంలోని ప్రధాన వీధుల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఖలీల్‌వాడీ, హైదరాబాద్ రోడ్డు, కుమార్‌గల్లీ, పూసలగల్లీ, ఆర్‌పీ రోడ్డు, బోధన్ రోడ్డు, అహ్మద్‌పురా కాలనీ, గంజ్‌రోడ్డు నిత్యం జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాలు. ఇక్కడ వందల సంఖ్యలో దుకాణాలు నిర్వహిస్తున్నారు.

పెద్ద షాపులు, హోల్‌సెల్ మార్కెట్, వస్త్రవ్యాపారాలు, ఇతర వ్యాపారాలు సాగుతున్నాయి. వీరు విశాలమైన స్థలంలో షెట్టర్‌లలో (మడిగె) వ్యాపారాలు చేస్తున్నారు. అయితే వీరి భారీ షాపుల ముందు టీ స్టాల్స్, పాన్ షాపులు, చిరు వస్త్ర వ్యాపారులు, కూరగాయాలు అ మ్మేవారికి, ఇతరులకు స్థలం అద్దెకు ఇస్తున్నారు. గంజ్ మార్కెట్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోల్‌సెల్ దుకాణాలు, ఎరువులు, రసాయనాలు అమ్మే షాపులు, ఐరన్ షాపులు, కిరాణా షాపుల వారు తమ దుకాణాల ముందు మరో చిన్న షాపులు అద్దెకిస్తున్నారు. నెలకు రూ. 5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ట్రేడ్‌లైసెన్సులు లేకుండానే..

నగరంలో ఎలాంటి వస్తు విక్రయం జరపాలన్నా బల్దియా అనుమతి అవసరం. అందుకు ట్రేడ్ లైసెన్స్ టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. సంవత్సరానికి రెండుసార్లు రెన్యూవల్ చేసుకోవాలి. అయితే పెద్ద షాపుల వారు తమ షాపుల ముందు ఏర్పాటు చేయిస్తున్న చిన్న వ్యాపారాలకు ఎలాంటి అనుమతి తీసుకోవడం లేదు. తద్వారా బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారు. రోడ్డు మీద జామకాలు, ఇతర పండ్లు వంటి వాటిని విక్రయిస్తేనే వారి వద్ద నుంచి థాయ్ బజార్ పేరిట రూ.20 వసూలు చేస్తున్నారు. కానీ దర్జాగా నిర్మాణాలు ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్న వ్యాపారానికి మాత్రం ఎలాంటి అనుమతి లేదు.

ఆదాయవనరులుగా ఫుట్‌పాత్‌లు..

నగరంలోని ప్రధాన రోడ్లమీద నిర్వహించే వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌ను మొత్తం ఆక్రమించేస్తున్నారు. డ్రైనేజీమీదనే కౌంటర్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. డ్రైనేజీని కవర్‌చేసి దానిమీద తాత్కాలిక నిర్మాణాలు చేసుకుంటున్నారు. ఖలీల్‌వాడీలోని హాస్పిటల్ ఎదుట ఫుట్‌పాత్‌ను కబ్జాచేసి పేషెంట్లకు కుర్చీలు వేసి కూర్చొబెడుతున్నారు. టీస్టాల్స్, వంటి దుకాణాలు నిర్వహిస్తున్నారు.



ఖలీల్‌వాడిలోని హాస్పిటల్ ఎదుట ఫుట్‌పాత్ మీద చైర్‌లలో కూర్చున్న పేషెంట్లు



శంభుని గుడి పక్క రోడ్డుపై దుకాణాల సామగ్రి

SAKSHI FOCUS సాక్షి ఫోకస్



అహ్మదీ బజార్‌లో రోడ్డుపై దుకాణాలు

ట్రాఫిక్‌కు అంతరాయం..

దుకాణాల ముందు రోడ్డుమీద వరకు సామగ్రి పెట్టుకోవడంతో, వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ట్రేడ్ లైసెన్సు తీసుకోవడం ఇలా..

- నగరంలో వ్యాపారం నిర్వహించేవారు ముందస్తుగానే కార్పొరేషన్ నుంచి అనుమతి (ట్రేడ్‌లైసెన్సు) తీసుకోవాలి.
- మొదట దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, పన్నులు పూర్తిగా చెల్లించినట్లు రశీదు జతచేయాలి.
- వ్యాపారానికి సంబంధించిన ఆఫీసు కొలతలు, - బిల్డింగ్ ఫొటో సమర్పించాలి.
- రోడ్డుకు 1000 స్క్వేర్ ఫీట్ లోపల వ్యాపారం నిర్వహిస్తే స్కేర్ ఫీట్‌కు రుసుము రూ. 2
- 20 స్క్వేర్ ఫీట్‌ల లోపల స్క్వేర్ ఫీట్‌కు రూ. 3
- 20 నుంచి 30 స్క్వేర్ ఫీట్‌ల లోపల స్క్వేర్ ఫీట్‌కు రూ. 5 చొప్పున రుసుము నిర్ణయిస్తారు.
- అనుమతి లేకుండా వ్యాపారం నిర్వహించిన వారు 90 రోజుల లోపు అయితే 25 శాతం ఫైన్‌తో రుసుము చెల్లించాలి. 90 రోజులు దాటితే 50 శాతం ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది.
- కమర్షియల్ భవనాలకు ఫైర్‌సేఫ్టీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఈ అనుమతి 11 నెలలకు వర్తిస్తుంది. సకాలంలో రెన్యూవల్ చేసుకోకపోతే అసలు పన్నుతోపాటు 25 రెట్లు అధికంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలి



బస్టాండ్, ఖలీల్‌వాడీ, గాంధీచౌక్ వంటి రద్దీ ప్రదేశాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తున్నారు. నడుచుకుంటూ వెళ్లేవారికి ఇబ్బందులు కలుగుతున్నాయి. అర్జంట్ పనిమీదవెళ్లేవారు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించినవారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– మురళి బాజిరెడ్డి, ఖలీల్‌వాడి వాసి

సర్వేలతో బిజీగా ఉన్నాం

కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ టౌన్ ప్లానింగ్ విభాగానిదే. నగరంలో పలుచోట్ల ఆక్రమణలు జరుగుతున్నాయని నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ సర్వే సాగుతోంది. త్వరలోనే ఆక్రమణలను తొలగించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. సిబ్బంది కూడా సరిపడా లేదు. సరిపడా సిబ్బందితో ఈ డ్రైవ్ నిర్వహిస్తాం.

– సత్యనారాయణ, టీపీవో

లైసెన్సులు తప్పనిసరి



వ్యాపారం చిన్నాదైనా, పెద్దదైనా అనుమతి తప్పనిసరి. నగరంలో వ్యాపారులు తమకు కేటాయించిన స్థలంలో కొంత ఇతరులకు సబ్‌లీజ్ ఇవ్వడం సరికాదు. ట్రేడ్ లైసెన్సులేకుండా వ్యాపారం చేయడం నేరం. లైసెన్సులేని వ్యాపారాలతో బల్దియాకు ప్రతినెలా రూ. కోట్లలో ఆదాయానికి గండిపడుతోంది. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 100 శాతం ట్రేడ్‌లైసెన్సులు జారీచేస్తాం.

– గంగిశెట్టి రాజేంద్ర కుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్

క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన వ్యవసాయ కమిషన్ సభ్యులు



నిజామాబాద్ సిటీ: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం తుమ్మల నివాసంలో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో పాటు సభ్యులు గడుగు గంగాధర్ తదితరులు కలిసి శాలువాతో సన్మానించారు. వ్యవసాయ కమిషన్‌కు సంబంధించిన పలు అంశాలు చర్చించినట్లు గడుగు గంగాధర్ తెలిపారు.

వర్నిలో ఒకరికి డెంగీ



వర్ని: వర్నిలో ఓ యువకుడికి డెంగీ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తి ఇంటికి గురువారం వైద్య సిబ్బంది వెళ్లి అవగాహన కల్పించారు. జిల్లా డెంగీ నివారణ అధికారి హక్తర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పరిసరాలను చుట్టుపక్కల 100 ఇళ్లలో దోమల నివారణ మందు పిచికారి చేయించారు. హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఏఎన్ఎంలు లక్ష్మి, సునీత పాల్గొన్నారు.

జీజీహెచ్‌ను సందర్శించిన డీజీ అనిల్‌కుమార్



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఎస్‌పీఎఫ్ డీజీ అనిల్‌కుమార్ గురువారం సందర్శించారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మహిళా సిబ్బందిని నియమించాలని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ డీజీని కోరారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు మెడ్‌ప్లస్, వరుణ్ మోటార్స్ కంపెనీల వారు హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ మేనేజర్, సూపర్‌వైజర్, అడ్వైజర్, జూనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్టు, ఆడిట్ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. ఇంటర్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నగరంలోని శివాజీనగర్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు, 9948748428, 6305743423 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'నన్నెవరూ ఏమీ చేయలేరు'

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ కార్యాయలంలో ఓ అధికారి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై గురువారం సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఓ అధికారి ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సమాచారం. కార్యాలయానికి సంబంధించిన సమాచారాన్ని బయటకు తెలిపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలిసింది. తనను ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నట్లు సమాచారం. తాను ఇక్కడి వాడిని కానని, బదిలీపై వెళ్లాల్సి వస్తే జిల్లాను అగ్నిగుండం చేస్తానని తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

అట్టహాసంగా పాసింగ్ అవుట్ పరేడ్

- శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు
- విధుల్లో చేరేందుకు సిద్ధం
- కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులతో సందడిగా మారిన జాన్కంపేట సీటీసీ



సెల్యూట్ చేస్తున్న డీజీ అనిల్ కుమార్, ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ



కవాతు చేస్తున్న కానిస్టేబుళ్లు

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట వద్ద గల కమిషనరేట్ ట్రెయినింగ్ సెంటర్ (సీటీసీ)లో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకన్న కానిస్టేబుళ్లు ఆయనకు గౌరవ వందనం చేశారు. శిక్షణ సమయంలో ఐదు ఈవెంట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురికి డీజీ మెడల్స్ అందించారు. ఆల్‌రౌండర్‌గా హర్షవర్ధన్, బెస్ట్‌పరేడ్ కమాండర్‌గా జె వాసు, బెస్ట్ ఫైరింగ్ క్రాంతి కుమార్, బెస్ట్ ఇండోర్‌గా రాజ్‌కుమార్, బెస్ట్ అవుట్ డోర్ నరేష్‌కు మెడల్స్ అందజేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 250 ఏఆర్ కానిస్టేబుళ్లుగా ఇక్కడ శిక్షణ పొందారు. కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు హాజరు కావడంతో సీటీసీ ప్రాంగణం సందడిగా మారింది.



మొక్క నాటి నీరు పోస్తున్న డీజీ అనిల్‌కుమార్

శిక్షణ పూర్తిచేసుకున్న సోదరులు

రంగారెడ్డి జిల్లా తలక్కొండ మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్, శివకుమార్ అన్నదమ్ములు ఒకేసారి కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసి వీరిని చదివించారు. రాఘవేందర్ ఎం ఫార్మసీ, శివకుమార్ బీటెక్ పూర్తి చేశారు. రాఘవేందర్ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ప్రిపేర్ కాగా శివకుమార్ కరోనా సమయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోవడంతో కానిస్టేబుల్‌కు ప్రిపేర్ అయ్యారు. ఇద్దరు ఒకేసారి కొలువు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



తల్లిదండ్రులతో రాఘవేందర్, శివకుమార్

సంతోషంగా ఉంది



మా నాన్న వ్యవసాయ కూలీగా పని చేస్తూ నన్ను చదివించారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడి తల్లిదండ్రుల కోరిక నెరవేర్చా.శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది. ఇక్కడ క్రమశిక్షణతోపాటు అన్ని అంశాల్లో తర్ఫీదు పొందాను.

– ఎస్ దేవయ్య, రంగారెడ్డి జిల్లా

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాను. కానిస్టేబుల్ నోటిఫికేషన్ రాగానే ప్రైవేట్ జాబ్ వదిలి ప్రిపేర్ అయ్యాను. ఉద్యోగం సాధించి ఏఆర్ కానిస్టేబుల్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నా.

– సుకుమార్‌రెడ్డి, వికారాబాద్

ఎంతో నేర్చుకున్నా..



కానిస్టేబుల్ శిక్షణ సమయంలో ఎంతో నేర్చుకున్నా. మా నాన్న 14 ఏళ్ల క్రితం చనిపోయారు. అమ్మ లక్ష్మమ్మ, అన్న రాజు ప్రోత్సహించడంతో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. ఇద్దరికి నా జీవితాంతం రుణపడి ఉంటాను.

– జి నగేశ్, శంషాబాద్

అమ్మకు అండగా ఉంటా



మా అమ్మ లక్ష్మి అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తూ నన్ను పెద్ద చేసింది. నాన్న అనారోగ్యంతో 10 ఏళ్ల క్రితం మృతి చెందారు. కసితో చదివి కానిస్టేబుల్ జాబ్ సాధించాను. ఇప్పుడు మా అమ్మ, అక్కకు అండగా నిలుస్తాను.

– అనిల్, వెంకటాపూర్, రంగారెడ్డి జిల్లా

కుటుంబ సభ్యుల్లో ఆనందం



కుటుంబ సభ్యులతో సెల్ఫీ తీసుకుంటున్న కానిస్టేబుల్







కఠోర సాధన, ఆత్మవిశ్వాసంతో కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు.. కఠిన శిక్షణతో రాటుదేలారు. తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరడానికి సిద్ధమయ్యారు. ఆ క్షణాలను చూసి వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. జాన్కంపేట సీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఆ అపురూప క్షణాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్













ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

- గోదాం రోడ్డులోని కూరగాయల విక్రేతల తరలింపు
- గాంధీ గంజ్‌లో స్థలం కేటాయింపు
- వాహనదారులకు తప్పిన ఇబ్బందులు



గాంధీగంజ్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి (ఫైల్)



గోదాం రోడ్డులో క్లియర్‌గా ఉన్న ట్రాఫిక్

సుభాష్‌నగర్: నగరంలోని గోదాం రోడ్డులో కూరగాయల వీధి వ్యాపారులకు గాంధీగంజ్‌లో స్థలం కేటాయించడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికింది. నిత్యం ట్రాఫిక్‌తో సతమతమయ్యే ఈ రోడ్డులో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు. రోడ్డుకిరువైపులా దుకాణాలు, వాటి ముందు కూరగాయల వీధి వ్యాపారులు, వినియోగదారులతో ప్రతిరోజూ కిటకిటలాడేది. ఈ సమస్యపై ట్రాఫిక్, మున్సిపల్, మార్కెటింగ్ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతుండేవి. పలుమార్లు పోలీసుల ద్వారా వీధి వ్యాపారులను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం జరిగినా.. మళ్లీ షరా మామూలుగానే మారిపోయింది.

ఏఎంసీ చైర్మన్ నిర్ణయంతో..

నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డిని బాధ్యతలు స్వీకరించిన తర్వాత మార్కెటింగ్‌శాఖకు సంబంధించి ఒక్కో సమస్యపై సమీక్షించారు. అందులో భాగంగా కూరగాయల వీధి వ్యాపారుల సమస్య తెరపైకి రాగా, గాంధీగంజ్‌లో వీరికి స్థలం కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే, ట్రాఫిక్, మున్సిపల్, మార్కెటింగ్‌శాఖ అధికారుల సమక్షంలో చైర్మన్ నిర్ణయించారు. ఒక్క ఐడియాతో గోదాం రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. షాపుల యజమానులు డబ్బులు తీసుకుని కూరగాయల వీధి వ్యాపారులను ప్రోత్సహించడంపై సీరియస్ అయిన చైర్మన్ గంగారెడ్డి.. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కూరగాయల వీధి వ్యాపారులకు గాంధీ గంజ్‌లో స్థలం కేటాయించారు. అంతకుముందు గాంధీ గంజ్‌లో నెలకొన్న చిన్న చిన్న మరమ్మతులు, సమస్యలకు పరిష్కారం చూపారు. దీంతో ప్రస్తుతం గోదాం రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం లేదు. చైర్మన్ నిర్ణయంపై నగరవాసులు, కూరగాయల వీధి వ్యాపారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

క్రీడా సమాచారం

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విస్లవత్ సంధ్య రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమేష్‌గౌడ్ తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని సంధ్య, పీడీ రమేష్‌గౌడ్‌లను ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు అభినందించారు. హెచ్ఎం మధుపాల్, వీడీసీ సభ్యులు కంతి సాయన్న, పోతనక రాజు, గంగారాం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నస్రీన్ బేగం పాల్గొన్నారు.

తిర్మన్‌పల్లి విద్యార్థులు..



నిజామాబాద్ రూరల్: మండలంలోని తిర్మన్‌పల్లి పాఠశాలకు చెందిన విజయ్, షేక్ సల్మాన్, సౌమ్య ప్రవీన్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సీతాదేవి తెలిపారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

మిట్టపల్లి విద్యార్థులు..

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి విద్యార్థులు మేఘన, తరుణ్ రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపికైనట్లు హెచ్ఎం సుశీల్ కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని ఆయన ఆకాంక్షించారు. పీడీ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడల్లో ప్రతిభ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ముదోల్‌లో జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ పూర్ణచందర్ తెలిపారు. చెస్‌లో ద్వితీయ స్థానం, కబడ్డీ, ఖో ఖో, టెన్నికాయిట్ క్రీడల్లో గెలుపొందినట్లు పేర్కొన్నారు. పాఠశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిందన్నారు. గెలుపొందిన విద్యార్థులను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ సాయన్న, ఉపాధ్యాయులు దయల్, చక్రపాణి, గంగాధర్, జ్ఞానేశ్వర్, రాజేందర్ పాల్గొన్నారు.

ఉషూ క్రీడల్లో కేజీబీవీ విద్యార్థులు..



బాల్కొండ: ముప్కాల్ కేజీబీవీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో సత్తా చాటారు. తొమ్మిదో తరగతి విద్యార్థి మహేశ్వరి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. వారిని గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఎస్‌వో వినోద తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ



నవీపేట: నవీపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్–17 వెయిట్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి టోర్నీని గురువారం నిర్వహించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరి నాగమణి, ఎంఈవో సక్కి అశోక్‌కుమార్, పీడీ రవీందర్, హెచ్ఎం రత్నకుమారి పాల్గొన్నారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్ నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు నాగారంలోని రాజారాం స్టేడియంలో కిడ్స్ చాంపియన్షిప్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ నరాల, రాజాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్– 8, 10, 12 విభాగాల్లో సెలెక్షన్ కంటోర్నీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిని మంచిర్యాల జిల్లాలో డిసెంబర్ 1న జరిగి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

బాన్సువాడ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలను గురువారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు.

క్రైం కార్నర్

సౌదీలో నర్సింగ్‌పల్లి వాసి మృతి



షేక్ జమాల్ (ఫైల్)

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ జమాల్ అలియాస్ అహ్మద్ మషూర్ (56) సౌదీ అరేబియాలో బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ జమాల్ కొంత కాలంగా ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్తున్నాడు. అక్కడ మున్సిపాలిటీలో ఉద్యోగం చేసేవాడు. కొన్ని రోజులుగా గుండె సంబంధ వ్యాధితో బాధ పడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి గుండెపోటుకు గురై మరణించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన తండ్రి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి రప్పించాలని కుమారుడు జాఫర్ కోరారు.

అనారోగ్యంతో హోంగార్డు..



సాబేరాబేగం (ఫైల్)

బోధన్‌టౌన్: బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న సాబేరా బేగం (55) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ వెంకటనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ఆర్మూర్ టౌన్: మద్యం తాగి వాహనాలను నడపొద్దని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గురువారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. బైక్‌పై వెళ్లే వారు హెల్మెట్ పెట్టుకోవాలని అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం ఆరు డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీ: పలువురికి గాయాలు



ఇందల్వాయి: ఇందల్వాయి మండలం దేవితండా వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైనట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. వివరాలు.. కామారెడ్డికి చెందిన బోలెనాథ్, స్వరూప, బలరాం కారులో బోధన్ నుంచి కామారెడ్డి వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి బాసర వైపు వెళ్తున్న కారు అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టి కామారెడ్డి మార్గంలో వెళ్తున్న వీరి కారుని ఢీకొంది. ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ ఢీకొని బాలుడికి..

రెంజల్: ఇసుక టిప్పర్ ఢీకొని కందకుర్తి గ్రామంలో ఐదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం రాత్రి గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ఢీకొనడంతో బాలుడి కాలు విరిగింది. ఇంటి ముందు రోడ్డు పక్కన నిలబడి ఉండగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై రెంజల్ ఎస్సై సాయన్నను వివరణ కోరగా ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి నగర్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రోడ్ నంబర్– 3 లో నివాసం ఉంటున్న ప్రశాంత్ గౌడ్ కుటుంబ సభ్యులు ఆర్మూర్‌లో శుభకార్యానికి వెళ్లారు. తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు, ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ముదిరాజ్ వీధికి చెందిన నట్వల్ నరేశ్(35) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు.. నరేశ్ భార్యతో విడాకులు తీసుకొని తల్లితో కలిసి ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకొని జీవించే నరేశ్ మద్యం తాగి తరుచు తల్లితో గొడవ పడేవాడు. దీంతో ఆమె కూతురికి దగ్గరికి వెళ్లిపోయింది. నరేశ్‌కు అప్పులు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

ఒకరి అదృశ్యం



సాయిలు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన తిమ్మపురం సాయిలు(40) కొన్ని రోజులుగా కనిపించక పోవడంతో గురువారం అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. సాయిలు కొంతకాలంగా తన భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పని చేసుకుంటున్నాడు. నాలుగు నెలల క్రితం ఫిట్స్ రావడంతో అతను తన ఇంటికి వచ్చేశాడు. నెలరోజుల క్రితం తిరిగి హైదరాబాద్‌లో పని చేసుకుంటానని తల్లి మాణెమ్మకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. సాయిలు వద్ద ఫోన్ లేకపోవడంతో అతని తల్లి మాణెమ్మ హైదరాబాద్‌లోని కోడలికి ఫోన్ చేసి అడగ్గా హైదరాబాద్‌కు రాలేదని తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. దీంతో గురువారం ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సదాశివనగర్‌లో యువతి..

సదాశివనగర్: సదాశివనగర్‌కు చెందిన ఓ యువతి (25) గురువారం అదృశ్యమైనట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. ఆమె ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.